# ఫుట్ట

వంటగదిలో అష్టావధానం చేస్తున్నా ఆలోచన మాత్రం దుబాయ్‌లో ఉన్న అమీర్‌చుట్టే అల్లుకుపోయి ఇబ్బందిపెడ్తోంది. రాత్రంతా కలత నిద్ర... కలల్లో అమీర్... కబుర్లు చెప్తూ... కౌగిలించుకుంటూ... నాపక్కనే ఉన్నట్లు... పేదరికం శాపమే. పెళ్ళాం బిడ్డల ఆర్థికావసరాల కోసం దుబాయ్, జెద్దాలాంటి సుదూరప్రాంతాలకు వలస వెళ్ళే మగవాళ్ళ పరిస్థితి ఎంతటి దయనీయమో అంతకన్నా దారుణమైన పరిస్థితి ఇక్కడ ఒంటరితనం అనుభవించే ఆడవాళ్ళది. అది ఎంత బాధాకరమో అనుభవిస్తేగాని తెలీదు.

"మా! కాలేజీకి లేటవుతోంది. జల్దీ కానీ"

షమీ గొంతు... పోలికలు ఎలా వస్తాయో? అంతా అల్లాకే తెలియాలి. ఆ కళ్ళు, నుదురు, పెదాలు అచ్చం నా పోలికే. గొంతే వాడి నాన్నది. వీడు బైటనిలబడి స్నేహితుల్తో మాట్లాడుతుంటే ఎన్ని సార్లు భ్రమపడ్డానో అమీర్ చెప్పాపెట్టకుండా వచ్చేశాడేమోనని. అమీర్ డబ్బుల్లేని గరీబే కాని మంచితనంలో మాత్రం అమీరే. కలో గంజో తాగినా, రఫీ గొంతులోంచి జాలువారిన మధురమైన పాటలా సంసారం  సాగిపోయేది.

షమీ తొమ్మిదో తరగతి కొచ్చేప్పటికి అమీర్‌కి దిగులు పట్టుకుంది. దుబాయ్‌వెళ్ళి ఏదో కంపెనీలో కార్మికుడిగా చేరిపోతానన్నప్పుడు ఏడుపు ఆపుకోలేక పోయాను. "మన నలుగురు పిల్లల కోసం తప్పదు బేగం. ఒక్కగానొక్క కొడుకు షమీని బాగా చదివించాలా... మిగతా ముగ్గురు కూతుర్ల నిఖాలు జరిపించాలా... వీళ్ళ భవిష్యత్తుకోసం మనం త్యాగాలు చేయక తప్పదు" అంటూ ఓదార్చాడు అమీర్. అక్కడ తింటున్నాడో, పస్తులుంటున్నాడో తెలీదుగాని ఇల్లు

గడవడానికి అవసరమైన డబ్బులు మాత్రం నెలనెలా పంపిస్తున్నాడు.

షమీ ఈ ఏడు యింటర్ ఫైనల్ కొచ్చాడు. మిగిలింది వాడి డిగ్రీ చదువు.... వాడికేదైనా ఉద్యోగమొస్తే ఆడపిల్లల నిఖాలు పెద్ద సమస్య కాదు. అంటే మరో మూడేళ్ళు నాకూ అమీర్‌కి ఎడబాటు తప్పదు. గుండెలో ఎన్ని గాయాలు మోస్తూ బతుకుతున్నానో ... అమీర్ శాశ్వతంగా దుబాయ్ వదిలి వచ్చాక చెప్పాలని ఎన్ని దుఃఖాల్ని దాచుకున్నానో...

షమీ కాలేజికెళ్ళిపోయాడు. ఒంటరితనం కొండచిలువలా చుట్టేసి... వూపిరాడకుండా... ఏదో తెలీని భయం శరీరాన్నంతా ఆక్రమిస్తూ... హైద్రాబాద్‌లో బతకటమే భయం... అందునా పురానా షెహర్‌లో బతకటం మరింత భయం... ఏ క్షణం ఏం జరుగుతుందో... ఏ అల్లరి మూకలు దాడిచేస్తాయో... అవకాశం దొరికితేచాలు మతకలహాలంటూ మారణహోమం సృష్టిస్తారేమోననే భయంలోనే మా జీవితాలు గడిచిపోతున్నాయి.

అమీర్‌తో చాలా సార్లు మొరపెట్టుకున్నాను ఈ బస్తీలో ఉండొద్దని. "నా పూర్వీకులనుంచి సంక్రమించిన ఆస్తి ఈ ఇల్లు. చిన్నదైనా స్వంత ఇంట్లో ఉంటున్నందుకు సంతోషపడాలి. వదిలి ఎక్కడికెళ్తాం చెప్పు? నేనిక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. చావూ ఇక్కడే" అన్నాడు వేదాంతధోరణిలో.

అల్లా ప్రసాదించిన జీవితాన్ని అనుభవించాక, పండి రాలిపోవడానికీ, ముష్కరమూకల చేతిలో అర్థాంతరంగా చనిపోవడానికీ ఉన్న తేడాని అమీర్‌కి అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నించి విఫలమైనాను.

"నాలుగొందలేళ్ళ చరిత్ర గలిగిన గొప్ప షెహర్ హైద్రాబాద్. మనమేనా... ఎన్ని వందల ముస్లిం కుటుంబాలు బతకటం లేదూ ఈ పురానా షెహర్‌లో..." అన్నాడు.

తలుపు తట్టిన శబ్దమైతే ఉలిక్కిపడి చూశాను. ఈ సమయంలో ఎవరై

ఉంటారు? షమీ స్నేహితులైతే ఇప్పుడెందుకొస్తారు? మతకలహాల గురించి ఆలోచిస్తున్నానేమో మనసులో భయం రెక్కలు విప్పుకుంటూ ... గుండె వేగంగా కొట్టుకుంటోంది.

మరోసారి తలుపుమీద చప్పుడైంది. పక్కింటి నుస్రత్ ఖాలా ఏమో...

వెళ్ళి తలుపు తీశాను. మునీర్... నుస్రత్ ఖాలా పెద్ద కొడుకు. బియస్సీ చదువుతున్నాడు.

"మా నిన్నోసారి రమ్మంది." అన్నాడు. అతని పక్కనే షేర్వాణీలో ఉన్న యువకుడు నిలబడి ఉన్నాడు. పల్చటి నాజూకైన శరీరం... మొహం నిండా అమాయకత్వం... మా షమీ కన్నా రెండు మూడేళ్ళు పెద్దయి ఉంటాడు. కొత్త మొహం... మా మొహల్లాలో చూసిన గుర్తు రావటం లేదు.

ఎవరితను అన్నట్లు మునీర్ వైపు చూసి కళ్ళెగరేశాను. "మా యింటి పక్కన చిన్న గది ఉందిగా. వారం క్రితం అందులోకి అద్దెకి దిగాడు. పేరు అబ్దుల్ ఖాదర్." అన్నాడు.

ఆ కుర్రవాడు సిగ్గుపడ్తూ తల వొంచుకునే "ఆదాబ్ ఆపా" అన్నాడు. చాలా ముచ్చటేసింది. ఈ కాలంలో కూడా ఇంత మర్యాదా మన్ననా ఉన్న మగపిల్లలు ఉన్నందుకు.

"కాలేజీలో చదువుతున్నావా బాబూ" అని అడిగాను.

"నహీ ఆపా. ఇంటర్మీడియెట్ ఫెయిలయ్యాను. అబ్బాజాన్‌కి మరింత భారం కాకూడదని ఏదైనా ఉద్యోగం వెతుక్కుందామని వచ్చాను. మునీర్ భాయ్‌కి తెల్సిన చోట ఖాళీ ఉందంటే వెళ్తున్నాం. నాకు ఉద్యోగం దొరకాలని దువా చేయి ఆపా" అన్నాడు.

"ఈ రోజు నమాజ్‌లో జరూర్‌గా దువా చేస్తాను బాబూ" అన్నాను మనస్ఫూర్తిగా.

వాళ్ళు వెళ్ళిపోయిన చాలా సేపటివరకు ఆ కుర్రాడే గుర్తొచ్చాడు. ఆడపిల్లలా ఎంత సుకుమారంగా ఉన్నాడో... ఇంత చిన్న వయసులో బతుకు తెరువు వెతుక్కుంటూ వూరుగాని వూరు వచ్చాడు. అల్లా.. ఆ కుర్రాడిమీద దయ చూపు అని మనసారా ప్రార్థించాను.

అతనికి ఉద్యోగం దొరకలేదని తెలిసి చాలా బాధ పడ్డాను.

“మా.. నీ దువా సరిపోయి ఉండదు. ఈ సారి మంచిగ దువా చేయి” విషయం విన్న షమీ ఆట పట్టించాడు.

పాఠాలు చెప్పించుకోడానికి మునీర్ వాళ్ళింటికెళ్ళే షమీకి అబ్దుల్ ఖాదర్ బాగా నచ్చాడు. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడటానికి ఎక్కువ కాలం పట్టలేదు. అబ్దుల్ ఖాదర్‌లోని మంచితనం, మృదుత్వం సూదంటు రాయిలా మా మొహల్లాలో చాలా మందిని ఆకట్టుకుంది.

నెల తిరక్కుండానే సెల్ ఫోన్లు రిపేరు చేసే షాపులో చిన్నపాటి ఉద్యోగం దొరికిందని తెలిసి చాలా సంతోష పడ్డాను.

“ఆపా... మూ మీఠా కీజియే” అంటూ తీపి బూంది కాగితంలో చుట్టిచ్చాడు.

“నీ కష్టాలు ఈ రోజుతో తీరిపోయాయి. జాగ్రత్తగా ఉద్యోగం చేసుకో. కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకో” అన్నాను.

“నీ దువా ఉంటే జరూర్‌గా నౌకరీలో రాణిస్తాను ఆపా” అన్నాడు.

నెల రోజుల్లోనే ఎంత దగ్గరయ్యాడో! స్వంత తమ్ముడికన్నా ఎక్కువగా... నలుగురు అన్నదమ్ముల్లో ఇతనే పెద్దవాడు. అక్కలు లేరని చెప్పినపుడు ‘నేనున్నానుగా’ అన్నాను.

“సరే. ఈ ఖుష్ ఖబర్ విన్న సందర్భంగా రాత్రి మా యింట్లో దావత్. నువ్వూ మునీర్ కలిసి రండి” అన్నాను.

షమీని మార్కెట్‌కి పంపించి కిలో మాంసం తెప్పించి కూర వండాను.

బగారా అన్నం, దాల్చా చేశాను.

భోజనాల దగ్గర షమీ అడిగిన ప్రశ్న ఉగ్రవాదం గురించిన చర్చని లేవదీసింది.

"మునీర్ భాయ్, ముంబయ్ పేలుళ్ల కేసులో చాలా మందికి శిక్ష పడింది కదా. అసలు ముంబయ్‌లో వరుసగా బాంబు పేలుళ్ళు ఎందుకు జరిగాయి? నాకు అర్థమయ్యేలా చెప్పు".

"బాబ్రీ మసీద్ కూల్చివేత తర్వాత ముంబయ్‌లో జరిగిన మత ఘర్షణల్లో ముఖ్య పాత్ర పోషించింది బాల్ థాక్రే అధ్వర్యంలోని శివసేన, బిజెపీలే. ముస్లింల ఇళ్ళకు గుర్తులు పెట్టి ఒక పథకం ప్రకారం మారణకాండ సాగించారు. ఈ విషయం సాక్ష్యాధారాల్తో సహా ధృవీకరించినందుకే శ్రీకృష్ణ కమీషన్‌ని మురళీ మనోహరజోషీ ప్రభుత్వం మొదట్లో రద్దు చేసింది. కానీ మార్చి నెల్లో జరిగిన వరస బాంబు పేలుళ్ళకు మాత్రం ముస్లిం ఉగ్రవాదమే కారణం"

"బాంబులు పెట్టి కొన్ని వందల ప్రాణాల్ని బలి తీస్కోవటం తప్పు కాదా? ఖుదా కూడా మెచ్చడు. అందులో అన్నెంపున్నెం ఎరుగని పసి పిల్లలు, అమాయకులు, ఆడవాళ్ళు ఎవరైనా ఉండొచ్చు. అసలు వాళ్ళ ప్రాణాలు తీయాల్సినంత తప్పు వాళ్ళేం చేశారు?" అని అడిగా.

"ఏ ఉగ్రవాదమైనా అమాయకుల ఉసురు తీయటం తప్ప ఏముంది ఆపా? వాళ్ళకు పాపపుణ్యాల ప్రసక్తి ఉండదు. తమ అస్థిత్వాన్ని నిరూపించుకోవటం కోసమో నిల్పుకోవటం కోసమో మారణహోమం సృష్టిస్తుంటారు."

"యా అల్లా... ఎంత ఘోరం! మనిషిని మనిషి చంపటమే అమానుషం. శత్రువు ఐతే సరే. మనల్ని మనం చంపుకోవటమేమిటి?" అన్నాను బాధ పడ్తూ.

"ఇస్లాం ఉగ్రవాదంలో సుశిక్షితులైన ఐయస్ఐ ఏజంట్లు మన దేశంలో ఎనిమిదివేల మంది వరకు ఉన్నట్లు సమాచారం. అలానే మనదేశంలోని ముస్లిం

యువకులు పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్, ఆక్రమిత కాశ్మీర్‌లలో ఉన్న సైనిక శిబిరాల్లో ఉగ్రవాద శిక్షణ పొందిన వాళ్ళు ఇరవై వేలకు పైగా ఉన్నారట.”

“అయ్యో! వాళ్ళు చేసేది తప్పని వాళ్ళకెవరైనా నచ్చచెప్పగలిగితే ఎంత బావుంటుంది?”

“దానికి అవకాశమే లేదు మా! అమాయకమైన ముస్లిం యువకుల్ని ఇస్లాం మతోద్ధరణ పేరుతో, పవిత్ర యుద్ధం జిహాద్ పేరుతో... ఇవేవీ పనిచేయకపోతే డబ్బుని ఎరచూపి తమ వలలోకి లాక్కుంటారు. వాళ్ళకు మనమందరం శత్రువులమని నూరి పోస్తారు. వాళ్ళని ఈ దేశం అన్యాయం చేస్తోందని, ఈ దేశాన్ని నాశనం చేయటంలోనే ఇస్లాం మతోద్ధరణ ఆధారపడి ఉందని బ్రెయిన్ వాష్ చేస్తారు. వాళ్ళని చూసి జాలి పడాలో, అసహ్యించుకోవాలో తెలీటం లేదు” అన్నాడు షమీ.

“ఎందుకు జాలి? వాళ్ళు మానవ రూపంలో ఉన్న మృగాలు. ప్రశాంతంగా ఉండే జీవితాల్లో చిచ్చు పెట్టి చలి కాచుకునే దుర్మార్గులు” అన్నాడు కోపంగా మునీర్.

“నా ఉద్దేశం అది కాదు మునీర్ భాయ్. మన దేశంలో పుట్టి, మన దేశంలో పెరిగి, ఉగ్రవాదిగా మారి, మన దేశస్థులనే శత్రువులుగా అనుకొంటున్నాడంటే అది అవగాహనా లోపం వల్ల కావచ్చు. సరైన చదువు లేకపోవటం వల్ల కావచ్చు. పేదరికం కావచ్చు. పరిస్థితుల ప్రభావం కావచ్చు”

“సచ్ హై మునీర్. మానసిక ఎదుగుదల కొరవడిన పసితనం కావచ్చు. వాళ్ళు ఉగ్రవాదులుగా మారాక ఏరివేయటం కన్నా అసలు అలా మారకుండా ప్రభుత్వం కొన్ని చర్యలు చేపడితే మంచిది. మన ముస్లింలకు మొదట కావల్సింది మంచి చదువు. ఆ తర్వాత చదువుకు సరిపడా ఏదో ఒక ఉద్యోగం. అప్పుడు ఆర్థిక స్థిరత్వం వస్తుంది. దాంతో పాటు ఆత్మ గౌరవం... మన వాళ్ళు మైనారిటీ కావటం వల్ల వచ్చే సమస్య చెప్పనా... ఒక ముస్లిం

యువకుడికి ఇంటర్వ్యూలో న్యాయంగానే తక్కువ మార్కులొచ్చి ఉద్యోగం రాలేదనుకో... కాని అతను మాత్రం తను ముస్లిం కాబట్టి వివక్షతో ఉద్యోగం ఇవ్వలేదని అనుకునే ప్రమాదం ఉంది. దాని వల్ల యువతలో పెరిగే కసి, కోపం.... ముస్లింలు నిజంగానే ఎదుర్కొంటున్న అవమానాలు, అవహేళనలు, పరాయీకరణ, అనుమానపు చూపులు... వీటిని ప్రభుత్వం నియంత్రిస్తే తప్ప, ముస్లిం సమాజంలో పేరుకు పోయిన పేదరికాన్ని రూపుమాపడానికి ప్రయత్నిస్తే తప్ప ఈ పరిస్థితి మెరుగు పడదు" అన్నాను.

"ఇస్లాం ఉగ్రవాదం వల్ల మన ముస్లిం యువకులు చాలా మంది ఇబ్బందులకు గురౌతున్నారు. అనుమానంతో అమాయక ముస్లిం యువకుల్ని పట్టుకెళ్ళి నానా హింసలకూ గురి చేస్తున్నారు మన పోలీసులు. ముస్లిం పేరు వింటే చాలు ఓ ఉగ్రవాదిని చూసినట్లే మనల్ని అవమానిస్తున్నారు" అన్నాడు మునీర్.

మేమందరం ఇంత వేడి వేడి చర్చ చేస్తున్నా ఒక్క మాట మాట్లాడకుండా తలొంచుకుని మెల్లగా అన్నం తింటున్న ఖాదర్‌ని చూస్తే ముచ్చటేసింది.

"ఖాదర్...నువ్వేమీ మాట్లాడవేం... నీ అభిప్రాయం చెప్పు" అన్నాను నవ్వుతూ.

"నాకిలాంటి విషయాలేవీ తెలీవు ఆపా" అన్నాడు సిగ్గుపడిపోతూ.

★ ★ ★

అమీర్ వస్తున్నాడని తెలిసి ఆకాశంలో విహంగమైనాను. నా అమీర్... నా కోసం, షమీ కోసం పరాయిదేశంలో తన శ్రమను పెట్టుబడిగా పెట్టి, శరీరాన్ని కరిగించి డబ్బుగా మార్చే క్రమంలో పస్తులుంటూ, ఇద్దరికే ఇరుకైన గదిలో సర్దుకున్న పది మందిలో ఒకడై, మా కోసం కలవరిస్తూ, పరితపిస్తూ....

అనుబంధాల్లోని తీయదనం పూవులో దాగున్న తేనెలా ఎంత తీయగా ఉంటుందో... నిఖాకి ముందు తనెవరో నేనెవరో... ఇప్పుడు తనూ నేను

తనువులు వేరైనా మనసు ఒకటిగా కల్సిపోయి... తను పడ్తున్న కష్టం నా హృదయంలో ఘనీభవిస్తూ... నా కన్నీళ్ళు అతని శరీరంలో ద్రవీభవిస్తూ... మేమిద్దరం కల్సి పాడుకునే మధురమైన పాట ఒకటే... షమీ.

అమీర్ వచ్చిన రోజు.... నేను విరబూసిన మల్లెపందిరిలా మారిపోయాను. ఎడారిలా అనంతమైన వేడిని దాచుకున్న అతని శరీరాన్ని నా స్పర్శతో చల్లటి నదీతీరంలా మార్చేశాను. యుగయుగాల నుంచి దాహార్తితో ఎదురుచూస్తున్న అతన్లోకి అమృతమై వర్షించాను. సంవత్సరాల ఎడబాటు కొన్ని గంటల్లో తీరేదా... నదిలా ఎన్ని మార్లు పొంగి ముంచెత్తినా ఎడారి కాంక్ష ఎప్పటికైనా తీరేనా... చందమామను అందుకునే ప్రయత్నంలో ఎగసిపడి, ఓటమిపాలై, మరల మరల ఎదను పదును పెట్టి , మదిని ఎక్కుపెట్టి అనవరతం కృషి చేసే పడుచు కెరటంలా... నేను. కొన్ని రాత్రులు ఓడి...ఓడి... చివరికి గెలిచి...

"ఇదిగో వీడే నా తమ్ముడు. పరాచికాలాడటానికి సాలా లేడని గొడవ చేసేవారుగా. నా కోసం అల్లా పంపించిన నా ఛోటా భాయి" అంటూ అబ్దుల్ ఖాదర్‌ని పరిచయం చేశాను.

"ఆదాబ్ భాయీజాన్" ఖాదర్ సిగ్గుల మొగ్గయి మెలికలు తిరిగిపోయాడు.

"యింత సిగ్గుపడే కుర్రవాణ్ని నిన్నే చూస్తున్నాను. మనం మగవాళ్ళం. పౌరుషంతో మీసం మెలేసేలా ఉండాలి. లేకపోతే మీ ఆపాలాంటోళ్ళకు చులకనైపోతాం" అంటూ అమీర్ అతన్ని తన పక్కన కూచోబెట్టుకున్నాడు. దుబాయ్ నుంచి షమీ కోసం తెచ్చిన బట్టల్లోంచి రెండు టీ షర్టులు తీసి అతనికి బహుమతిగా ఇచ్చాడు.

"వద్దు భాయీజాన్" అంటూ ఖాదర్ మొహమాట పడితే "నీ సొంత ఆపా ఐతే వద్దంటావా? నువ్వు తీస్కోకపోతే ఆపా బాధపడదా?" అంటూ అమీర్ అతని చేతిలో బట్టలు పెట్టాడు.

నెల్రోజులు కొన్ని నిమిషాల్లా జారిపోయాయి... అప్పుడే అమీర్ వచ్చి

నెలయ్యిందా? రెప్పపాటులా అన్పిస్తుందేం... కాలం ఆగిపోకూడదూ...నేనూ అమీర్... అంతే... మధ్యలో గాలిక్కూడా చోటివ్వకుండా...

దయలేనిది కదా కాలం... ఎంత క్రూరమైందో... రేపే అమీర్ తిరిగి వెళ్ళాల్సిన రోజు...

ఉదయం లేచినప్పటినుండీ గుండెనిండా కొండలేవో మోస్తున్నట్లు... దిగులు సముద్రాలు పోటెత్తుతూ.... అప్పటి వరకు ఎక్కడ దాక్కున్నాయో మరి, కళ్ళలో ఫూటబావులు పుట్టుకొచ్చాయి.

యంత్రంలా పన్చేస్తున్నా మనసంతా అమీర్ ప్రయాణం మీదే ఉంది. ఉండిపోకూడదూ అని అడగాలని మనసు ఆరాటం... ఆర్థికావసరాలు గుర్తొచ్చి మనసు మూగదైపోయింది.

సాయంత్రం ఆరింటికి నాకిష్టమైన జాంగ్రీతో పాటు మల్లెపూలు కొనుక్కొస్తానని అమీర్ అబిడ్స్ వైపుకెళ్ళాడు. షమీ చదువుకుంటానని మునీర్ వాళ్ళింటికెళ్ళాడు. నేను అమీర్ కిష్టమైన దమ్కా బిర్యాని చేయటంలో నిమగ్నమైనా.

నా ఆలోచనల్లో మునిగిపోయి... పరధ్యానంగా ఉన్నానేమో షమీ కేకతో ఉలిక్కిపడ్డాను.

"మా... అబిడ్స్‌లో బాంబు పెట్టారట. చాలా మంది చనిపోయారట. అబ్బాజాన్ ఏరమ్మా? ఎక్కడికెళ్ళారు?" అని వాడు ఆదుర్దాగా అడుగుతుంటే నాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. 'యా అల్లా... పర్‌వర్ దిగార్... నా షొహర్‌ని చల్లగా చూడు' అని మనసులోనే ప్రార్థించాను.

మొహల్లాలో అందరి మొహాల్లో ఆందోళన... భయం... బైటికెళ్ళిన తన వాళ్ళు ఏమైనారోనన్న ఆదుర్దా. బాంబు పేలిన చోట ఉండే అవకాశాల గురించి తర్జన భర్జన... అల్లా తమకు హాని తలపెట్టడన్న భరోసా... మరుక్షణం మరలా

భయం... ఏమో ఏమైందోనని. పగవాళ్ళు కూడా ఇలాంటి మానసిక హింస పడకూడదు.

షమీ వెళ్ళి చూసొస్తానన్నా వద్దని వారించాను. సెల్‌కి ఫోన్ చేస్తే కీక్ కీక్ అనే శబ్దం తప్ప జవాబు లేదు. బిజీగా ఉన్నాడేమో. సెల్ పాడైందేమో... మనసులో అసలు చెడు తలంపు ఎందుకు చేయాలి? అమీర్‌కి ఏమీ కాదు. వచ్చేస్తాడు. మరో పావుగంటలో... అరగంటలో... గంటైనా అమీర్ జాడ లేదు. మెలమెల్లగా భయం నరాల్లోకి పాకుతూ...

షమీని పిల్చుకుని ఆ ప్రాంతానికెళ్ళా. అక్కడి భీతావహ దృశ్యం చూస్తే గుండె మరింత బరువెక్కింది. పోలీసుల అదిలింపులు... మనుషుల హాహాకారాలు...ఆర్తనాదాలు... తెగిన కాళ్ళూ చేతులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. ఛిద్రమైన శరీరాల్తో మొహాలు కూడా గుర్తు పట్టలేకుండా పడి ఉన్న విగత జీవులు...

అమీర్ వీళ్ళలో ఉండడన్న బలమైన నమ్మకంతో మొహాలు వెతుకుతున్నా. నాలానే వెతుక్కుంటూ చాలా మంది... రోదనలు హృదయవిదారకంగా విన్పిస్తున్నాయి. ఇక్కడ లేకున్నా హాస్పిటల్‌కి తరలించిన క్షతగాత్రుల్లో ఉంటాడేమోనన్న భయం... వెతుకుతూ వెతుకుతూ ఒకచోట ఆగిపోయాను. షమీ చేతిని బలంగా పట్టుకుని శిలలా చూస్తూ ఉండిపోయాను. ఏడుపు రావటం లేదు. కాలం అక్కడ స్థంభించింది. నా చుట్టూ అనంతమైన శూన్యం...

రక్తంలో స్నానం చేసినట్లు... కుడి చేతి పిడికిట్లో మల్లెపూల దండ... ఎర్రగా రక్త వర్ణంలో మల్లెపూలు... ఎడం చేతి దగ్గరగా పడి ఉన్న స్వీట్ పాకెట్.... మడుగు కట్టిన రక్తంలో మునిగి ఉన్న జాంగ్రీలు... మరింత ఎర్రగా.... రక్త కాసారం... కన్నీటి సముద్రంలా మారి... దుఃఖ సాగరంలో మునిగిపోతూ నేను.... స్పృహ తప్పుతుంటే షమీ ఒడిసి పట్టుకున్న గుర్తు లీలగా....

★ ★ ★

అమీర్ పోయి నాలుగు రోజులైంది. దుబాయ్ నుంచి రాకున్నా బాగుండేది. నేనే కదూ వస్తే బావుండని కోరుకుంది? ఒక్కరోజు ముందు వెళ్ళిపోయినా బాగుండేది. నేనే కదూ మరో రోజు ఉండి పొమ్మని బతిమాలుకుంది? యా అల్లా... నేనేం తప్పు చేశానని ఇంత పెద్ద శిక్ష విధించావు? బాంబు పెట్టిన ఉగ్రవాదులు కన్పిస్తే వాళ్ళని నిలదీసి అడగాలని ఉంది... నా అమీర్‌కి, నాకూ మీ ఉగ్రవాదంతో ఏమిటీ సంబంధమని... అమాయకుల ప్రాణాలు తీసే అధికారం వాళ్ళకెవరిచ్చారని... నిజమైన ముసల్మానులే ఐతే అల్లా ప్రసాదించిన ప్రాణాల్ని అల్లా ఇష్టానికి వదిలేయక ఇలా అర్ధాంతరంగా హరించే హక్కుని అల్లా నుంచి ఎలా లాక్కున్నారని... ఎంత మంది స్త్రీలు విధవలైనారో, ఎంత మందికి కడుపు కోత మిగిలిందో, ఎంత మంది అనాథలైనారో... ఇంత మంది ఉసురు తీసి వాళ్ళేం సాధించారో కనుక్కోవాలని ఉంది.

ఎంత దుఃఖంలో మునిగి ఉన్నా మరో విషయం ముల్లులా గుచ్చుకుంటూనే ఉంది. నాలుగు రోజుల్నుంచి అబ్దుల్ ఖాదర్ కన్పించటం లేదు. బాంబు విస్ఫోటనం జరిగిన రోజు ఆరింటికి నమాజ్‌కని వెళ్ళాడని, మరలా తిరిగి రాలేదనేది మునీర్ సేకరించిన సమాచారం. ఆ సంఘటన తెలిశాక భయపడి వాళ్ళ వూరు వెళ్ళిపోయాడేమో అని సమాధానపడ్తున్నా మరో వైపు మనసు కీడుని శంకిస్తూనే ఉంది. ఆ రోజు నేను చూసిన అనేక శవాల మొహాల్ని మరోసారి గుర్తు చేసుకోడానికి ప్రయత్నించాను. పోలికల కోసం వెతుక్కున్నాను.

హాస్పిటళ్ళలో పడిఉన్న క్షతగాత్రుల్ని రెండ్రోజుల క్రితం వెళ్ళి పరిశీలించి వచ్చాడట మునీర్. వాళ్ళలో ఖాదర్ లేడని చెప్పాడు. మొహాలు గుర్తుపట్టలేనంతగా గాయపడి చనిపోయినవాళ్ళలో ఉన్నాడేమోనన్న అనుమానం తొలుస్తూ... ఏ తల్లి కన్న బిడ్డో... సరైన అంతిమ సంస్కారం కూడా లేకుండా ఈ లోకానికి అల్‌విదా చెప్పి వెళ్ళిపోయి ఉంటాడా... ఆలోచించేకొద్దీ నాలో కొద్దికొద్దిగా గడ్డ కడ్తున్న దిగులు... యా అల్లా... నా భర్త తో పాటు నువ్విచ్చిన ఛోటా భాయిని కూడా

నానుంచి లాగేసుకున్నావా?

ఏడుపు... కన్నీళ్ళు నా జీవితంలో విడదీయరాని భాగమై పోయాయి. సాయంత్రం ఐదున్నరప్పుడు షమీ పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు ఖాదర్ వచ్చాడని. అంత దు:ఖంలోనూ ఖాదర్ సహీ సలామత్‌గా ఉన్నాడని తెలిసి సంతోషపడబోతున్న క్షణంలో మరో మాటకూడా చెప్పాడు. "ఖాదర్ భయ్యాతో పాటు చాలా మంది పోలీసులు కూడా వచ్చారు మా! నుస్రత్ నానీ వాళ్ళ యింటిని, పక్క రూంని ఎందుకో వెతుకుతున్నారు. మునీర్ భయ్యాని పట్టుకుని ప్రశ్నిస్తున్నారు"

చేస్తున్న పనిని మధ్యలో ఆపి బైటికి పరుగెత్తాను. నుస్రత్ ఖాలా యింటి చుట్టూ జనం మూగి ఉన్నారు. వాళ్ళని తప్పించుకుని ఖాదర్‌ని సమీపించేలోపలే సోదా పూర్తి చేసుకుని పోలీసులు బైటికొచ్చారు. ఖాదర్ చుట్టూ వలయంలా ఏర్పడి అతన్ని పట్టుకెళ్తూ పోలీసులు... జనాలు ఎగబడి నన్ను వెనక్కి నెట్టేశారు. నాకూ ఖాదర్‌కి మధ్య దూరం పెరిగిపోతూ... యిక ఆపుకోలేక "ఖాదర్... మేరా ఛోటా భాయీ" అంటూ గొంతు చిరిగిపోయేలా అరిచాను.

ఖాదర్‌కి విన్పించలేదు. అతని వీపు తప్ప మొహం కన్పించటం లేదు. ఏడుస్తున్నాడేమో? భయంతో బిగుసుకుపోయాడో ఏమో? దిగులు పడ్తున్నాడో, బాధ పడ్తున్నాడో, శిలలా మ్రాన్పడిపోయాడో తెలీటం లేదు.

ఇంత అమాయకమైన మొహంతో, ఇంత సిగ్గరితనంతో ఉండే ఖాదర్ అంతటి ఘోరమైన తప్పు చేయగలడా? బాంబులు పెట్టి అమాయకుల ప్రాణాలు తీయగలడా? అతను ఉగ్రవాది అంటే నమ్మలేను గాక నమ్మలేను. పోలీసులకు అలవాటేగా... ఎక్కడ ఏ దురంతం జరిగినా అమాయక ముస్లిం యువకుల్ని ఇరికించి బాధించటం... అంతే అయి ఉంటుంది. నా ఖాదర్ అమాయకుడు. పోలీసుల మాయాజాలంలో చిక్కుకున్న మేకపిల్ల. మాంసమే కావాలనుకున్నప్పుడు ఏ మేక పిల్లయితేనేం తల తెగ్గొట్టటానికి...

ఏమో... మునీర్ చెప్పాడుగా.. ఉగ్రవాదులు మనకు అనుమానం రాకుండా మన మధ్యలోనే ఉంటారని... ఖాదర్ అలాంటివాడేనా... అదే నిజమైతే ఖాదర్‌ని చొక్కా పట్టుకుని అడగాలనుంది... నీకు నా అమీర్ ఏం అపకారం చేశాడని... నువ్వు చంపింది సాటి ముస్లిం హిందూ సోదరుల్నే అని... అది జిహాద్ కాదు దేశ ద్రోహమని... యింత రక్తం యిన్ని కన్నీళ్ళు పారించి ఏం సాధించావని...

ఖాదర్ అమాయకుడు. అతన్ని ఇరికించి బలి పశువుని చేశారు...

ఏది నిజం? ఎన్నెన్ని ప్రశ్నలు? ప్రవాహంలా నన్ను ముంచెత్తుతూ... మర కొక్కేలుగా మారి మెదళ్లో గుచ్చుకుంటూ... నేను పుట్టగా మారి, నాలో కదుల్తూ బుస కొడుతూ ప్రశ్నలు...

(రచన మాసపత్రిక, జనవరి **2009**)

★ ★ ★